రిజిస్టర్ పోస్టుకు మంగళం

- 1854లో ప్రవేశపెట్టిన బ్రిటిష్ పాలకులు
- వచ్చే నెల 1 నుంచి స్పీడ్ పోస్ట్‌లో విలీనం
- ఆ దిశగా తపాలా శాఖ అధికారుల చర్యలు
- పనిలో వేగం, సులభతరం కోసం మార్పు

సీతారామపురం : మొబైల్ ఫోన్లు, ఇంటర్నెట్ సేవలు అందుబాటులోకి రాని రోజుల్లో సమాచార వ్యవస్థకు ఉన్న ఏకైక మార్గం తపాలా శాఖ. అందులో ప్రధానమైనది రిజిస్టర్ పోస్టు. సుదీర్ఘ చరిత్ర కలిగిన ఈ సేవ ఇకపై కనుమరుగు కానుంది. సెప్టెంబర్ 1వ తేదీ నుంచి రిజిస్టర్ పోస్టును రద్దు చేసి ఆ సేవలను స్పీడ్ పోస్ట్‌లో విలీనం చేయనున్నారు. ఆ దిశగా పోస్టల్ అధికారులు ఇప్పటికే చర్యలు చేపట్టారు. దేశవ్యాప్తంగా నడుస్తున్న పోస్టల్ కార్యాలయాల్లో ఈ విధానం అమల్లోకి రానుంది. ఇప్పటికే పోస్టల్ వినియోగదారులకు నాణ్యమైన సులభతరమైన సేవలు అందించడానికి నూతన సాఫ్ట్‌వేర్‌ను అమలు చేస్తున్నారు. అందులో భాగంగానే రిజిస్టర్ పోస్ట్ సేవలకు సెలవు ప్రకటించనున్నారు. ఈ సేవలను రద్దు చేసి స్పీడ్ పోస్ట్ ద్వారా స్థానికంగా అయితే అదే రోజు, ఇతర ప్రాంతాలకు మరుసటి రోజే చేరే విధంగా చర్యలు చేపడుతున్నారు. దీంతో పౌర సేవలు వేగవంతం సులభతరం అవుతాయని తపాలా శాఖ అధికారులు వెల్లడిస్తున్నారు.


పోస్టల్ కార్యాలయం

1854లో ప్రారంభం

ప్రజలతో తపాలాశాఖది విడదీయరాని బంధం. ప్రైవేటు సంస్థలకు ధీటుగా సమాచార సేవలను కొనసాగిస్తోంది. బ్యాంకింగ్ సేవలు సైతం ప్రజలకు అందిస్తోంది. 1854లో తపాలా సేవల్లో రిజిస్టర్ పోస్ట్‌ను బ్రిటిష్ పాలకులు ప్రవేశపెట్టారు. దాదాపు 171 సంవత్సరాల సుదీర్ఘ చరిత్ర కలిగిన ఇది ముఖ్యమైన పత్రాలు, వస్తువులను సురక్షితంగా గమ్యస్థానాలకు చేర్చడంలో కీలకంగా వ్యవహరించింది. ముఖ్యంగా లీగల్ నోటీసులు, బ్యాంకింగ్ సేవల పత్రాలు, ఆధార్ కార్డులు, ఓటరు, గుర్తింపు కార్డులు, ఇంటర్నెట్ లేని రోజుల్లో గ్రీటింగ్ కార్డుల ద్వారా శుభాకాంక్షలు చెప్పడం వంటి పలు ముఖ్యమైన సేవలు కూడా రిజిస్టర్ పోస్టు ద్వారానే కొనసాగాయి. ఇలా పంపే పత్రాలు అవతల వ్యక్తికి చేరింది..లేనిది తెలియజేయడం రిజిస్టర్ పోస్టు ప్రత్యేకత.


రిజిస్టర్ పోస్టు అందిస్తున్న పోస్టుమెన్

ప్రభుత్వ శాఖల్లోనే అధికంగా..

రిజిస్టర్ పోస్టు సేవలను ప్రజలతో పాటు ప్రభుత్వంలోని వివిధ శాఖలు వినియోగించుకుంటున్నాయి. అన్ని రకాల ఉత్తర ప్రత్యుత్తరాలు రిజిస్టర్ పోస్టు ద్వారానే జరిగేవి. అయితే సెప్టెంబర్ 1 నుంచి రిజిస్టర్ పోస్టును రద్దు చేయనుండడంతో వినియోగదారులు ఆందోళన చెందుతున్నారు. స్పీడ్ పోస్ట్‌లో వీలనం చేస్తే పోస్టల్ చార్జీలు పెరుగుతాయని, అదనపు భారం తప్పదని భావిస్తున్నారు. స్పీడ్ పోస్టులకు వసూలు చేసే రుసుం అధికంగా ఉంటున్నందున, అలా కాకుండా రిజిస్టర్ పోస్టుకు వసూలు చేసే చార్జీలను అమలు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

ఆధునీకరణలో భాగంగా...

పోస్టల్ సేవలను మరింత ఆధునికరించేందుకు రిజిస్టర్ పోస్టును స్పీడ్ పోస్టులో విలీనం చేస్తూ నిర్ణయం తీసుకున్నట్లుగా తెలుస్తోంది. దేశీయ పోస్టల్ సేవలను క్రమబద్ధీకరించడం, పనితీరు ట్రాకింగ్ వ్యవస్థను బలోపేతం చేయడంలో భాగంగానే రిజిస్టర్ పోస్ట్ సేవలను తొలగించునున్నట్లు సమాచారం. స్పీడ్ పోస్ట్ అనేది వేగవంతమైన డెలివరీకి ప్రాధాన్యత ఇస్తుంది. ఇప్పుడు రిజిస్టర్ పోస్టుల సేవలు స్పీడు పోస్టులో విలీనం అయితే పత్రాలు మరింత వేగంగా గమ్యస్థానాలకు చేరడంతో పాటు ముఖ్యంగా స్పీడ్ పోస్ట్‌లో పంపే పత్రాలు, ఇతరాలు ఆన్‌లైన్ ద్వారా ఎక్కడ ఉంది, ఎప్పుడు చేరింది అని ట్రాకింగ్ ద్వారా తెలుసుకోవచ్చు. లోకల్ గా పంపే స్పీడ్ పోస్ట్ అదేరోజు డెలివరీ అయ్యే అవకాశం ఉంది.

క్లుప్తంగా

రేపట్నుంచి ప్రత్యేక ఆధార్ క్యాంపులు

కావలి (జలదంకి): కావలి మున్సిపాలిటీలోని 28వ వార్డు పరిధిలోని వార్డు సచివాలయాల్లో సెప్టెంబర్ 1వ తేదీ నుంచి 6వ తేదీ వరకు ప్రత్యేక ఆధార్ క్యాంపులను ఏర్పాటు చేస్తున్నట్లుగా మున్సిపల్ కమిషనర్ శ్రావణ్‌కుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 1న మద్దూరుపాడు, వెంగయ్యగారిపాళెం, 2న దంతంవారివీధి, 3న ముసునూరు-1,4, ఇందిరానగర్, 5న వైకుంఠపురం- 1, 6న జెండాచెట్టు వార్డు సచివాలయాల్లో క్యాంపులు జరుగుతాయని వివరించారు. ప్రత్యేక ఆధార్ క్యాంపుల్లో ఐదేళ్లలోపు ఎస్టీ పిల్లలకు ఆధార్ నమోదు, ఆరేళ్ల పైబడి ఇంత వరకు ఆధార్ పొందని, ఆధార్ నమోదు చేసుకుని ఉండి పోగొట్టు కున్న వారికి కొత్తగా కార్డులు మంజూరు చేయనున్నట్లు తెలిపారు. ఎస్టీలు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

కోలాహలంగా ముగ్గుల పోటీలు



సోమశిల: అనంతసాగరం మండలం పాతాళపల్లిలో వినాయక చవితి వేడుకలను వైభవంగా నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బిజివేముల పిచ్చిరెడ్డి ఆధ్వర్యంలో మహిళలకు ముగ్గులు, పిల్లలకు ఆటల పోటీలను శనివారం నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందజేశారు. మధ్యాహ్నం అన్నదానం చేశారు.

అన్నదానం




అల్లూరు: స్థానిక కోనేటి సెంటర్‌లోని వినాయకుడి మండపం వద్ద ముస్లిం సోదరులు షేక్ బాబు, షేక్ జంషీర్ ఆధ్వర్యంలో శనివారం అన్నదానం నిర్వహించారు. ఏటా ఇక్కడ కుల మతాలకు అతీతంగా హిందు, ముస్లిం సోదరులు వినాయక చవితి వేడుకలను ఘనంగా నిర్వహించడం ఆనవాయితీ. అందులో భాగంగా ముస్లిం సోదరులు సుమారు 250 మందికిపైగా అన్నదానం చేశారు.

పౌర హక్కులపై అవగాహన



సీతారామపురం : సమాజంలోని ప్రతిఒక్కరూ పౌర హక్కులు, చట్టాలపై అవగాహన పెంచుకోవాలని తహసీల్దార్ ఫజిహా అన్నారు. మండలంలోని అయ్యవారిపల్లి ఎస్సీ కాలనీలో పౌరహక్కుల దినోత్సవాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ. దేశంలోని ప్రతిపౌరుడికి రాజ్యాంగం కొన్ని హక్కులను కల్పించిందని తెలిపారు. వాటికి ఎవరైనా భంగం కలిగిస్తే చట్టపరంగా చర్యలు తీసుకోవచ్చని తెలిపారు. సమాజంలో అంటరానితనాన్ని రూపుమాపేందుకు ప్రతిఒక్కరూ కృషి చేయాలన్నారు. ఆర్ఐ సుభాని, వసతిగృహ మేట్రిన్ గాయత్రి, వీఆర్వో కేశవరావు, తదితరులు పాల్గొన్నారు.

వేరుశనగ సాగుపై అవగాహన


రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏడీఏ లక్ష్మీమాధవి

వరికుంటపాడు: మండలంలోని జీ కొండారెడ్డిపల్లిలో ఆత్మ ఆధ్వర్యంలో వేరుశనగ సాగుపై శనివారం రైతులకు అవగాహన కల్పించారు. ఏడీఏ జీ లక్ష్మీమాధవి మాట్లాడుతూ ట్యాగ్-73 రకం సాగుతో అధిక దిగుబడులు పొందవచ్చని తెలిపారు. ఆకుమచ్చ తెగులు, రసంపీల్చే పురుగుల నివారణపై సూచనలు చేశారు. ఏఓ ఎస్ సునీల్, టెక్నికల్ ఏఓ ఎస్ వెంకటసుబ్బారెడ్డి, వీఏఏలు, రైతులు పాల్గొన్నారు.

పాఠశాల అభివృద్ధికి సహకారం

సంగం: మండలంలోని మర్రిపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను పూర్వ విద్యార్థి పీ రాజేశ్వరరావు శనివారం సందర్శించారు. పాఠశాలకు అవసరమైన వసతులను హెచ్‌ఎం నరసింహమూర్తిని అడిగి తెలుసుకున్నారు. డయాస్, క్రీడాసామగ్రి, సైన్స్‌ల్యాబ్‌కు అవసరమైన పరికరాలను అందజేస్తామని హామీ ఇచ్చారు. గతంలో జెండాదిబ్బ ప్రాథమికోన్నత పాఠశాలలో మోడరన్ టాయిలెట్లు, ఇతర వసతులు కల్పించినట్లు రాజేశ్వరరావు తెలిపారు.

చెర్లోయడవల్లి ఉన్నత పాఠశాలకు దాతల విరాళం


పరమేశ్వరరెడ్డిని సత్కరిస్తున్న ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థులు

ఆత్మకూరురూరల్: చెర్లోయడవల్లి జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులకు రవాణా సౌకర్యం కల్పించేందుకు పలువురు దాతలు ముందుకొచ్చారు. పాఠశాల అభివృద్ధి కమిటీ విజ్ఞప్తి మేరకు ఆత్మకూరుకు చెందిన సాంబశివ చారిటబుల్ ట్రస్ట్ అధినేత కంచి పరమేశ్వరరెడ్డి రూ.1.50 లక్షలను అందజేశారు. నాగులపాడు, నారంపేట, అల్లీపురం, రావులకొల్లు, చెర్లోయడవల్లి గ్రామాలకు చెందిన పూర్వ విద్యార్థులు మరో రూ.2.12 లక్షలను సమకూర్చారు. శనివారం చెర్లోయడవల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో అభివృద్ధి కమిటీకి నగదును అందజేశారు. ఈ సందర్భంగా పరమేశ్వరరెడ్డిని హెచ్‌ఎం ఎంవీ రమణయ్య, పూర్వ విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు ఘనంగా సత్కరించారు. ఆత్మకూరు ఎంపీపీ కేతా వేణుగోపాల్‌రెడ్డి, చెర్లోయడవల్లి సర్పంచ్ ప్రభావతమ్మ, రావులకొల్లు మాజీ సర్పంచ్ రామిరెడ్డి మోహన్‌రెడ్డి, స్థానిక నాయకులు అల్లంపాటి రాజేష్‌రెడ్డి, సిద్ధం పెంచలయ్య, తదితరులు పాల్గొన్నారు.

వినాయకుడి లడ్డూల వేలం

ఆత్మకూరు: పట్టణంలోని వినాయకుడి విగ్రహాల వద్ద ఏర్పాటు చేసిన లడ్డూల వేలం పాటలను శనివారం నిర్వహించారు. పలువురు పోటీపడి లడ్డూలను వేలంలో దక్కించుకున్నారు. జేఆర్‌పేట ఎక్స్‌టెన్షన్‌లోని వినాయకుడి లడ్డూను ఊరిమిండి వెంకటేశ్వర్లురెడ్డి రూ.57 వేలకు దక్కించుకున్నాడు. బీఎస్సార్ కళాశాల సెంటర్‌లోని వినాయకుడి లడ్డూను పారెళ్ల లింగేశ్వరరావు, ఎం నవీన్ సంయుక్తంగా రూ.67,116కు దక్కించుకున్నారు. తోటవీధి వినాయకుడి లడ్డూను పెంచలయ్య రూ.15 వేలకు సొంతం చేసుకున్నాడు. అలాగే నారాయణరావుపేటలోని వినాయకుడి మెడలోని రూ.780 నగదు మాలను వేలంలో రూ.12 వేలకు రామకృష్ణ,భావన దంపతులు దక్కించుకున్నారు.


జేఆర్‌పేట వినాయకుడి లడ్డూను దక్కించుకున్న వెంకటేశ్వర్లురెడ్డి

కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

వింజమూరు(ఉదయగిరి): కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి గ్రామస్థాయి నుంచి బీజేపీని బలోపేతం చేసేందుకు నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని బీజేపీ సీనియర్ నాయకుడు మూలె బాలకృష్ణారెడ్డి కోరారు. వింజమూరులో ఉదయగిరి నియోజకవర్గస్థాయి బీజేపీ సమావేశాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉదయగిరి ఏఎంసీ చైర్మన్ పదవిని బీజేపీకి కేటాయించినట్లు తెలిపారు. ఈ పదవిని పార్టీ కోసం శ్రమిస్తున్న వ్యక్తులకు అందరి ఏకాభిప్రాయంతో ఇవ్వాలని అధిష్టానానికి సూచించారు. ఉదయగిరి నియోజకవర్గ ఇన్‌చార్జి కదిరి రంగారావు, జిల్లా మాజీ ఉపాధ్యక్షుడు పులిచర్ల నారాయణరెడ్డి, నాయకులు ఆవుల రోశయ్య, ఎన్ ప్రభాకర్‌రావు, లెక్కల వెంగళరెడ్డి, డేగా మధు, ఎం మల్లికార్జున, వెంకటస్వామినాయుడు, తదితరులు పాల్గొన్నారు.



మౌజన్లకు గౌరవవేతనం విడుదల చేయాలి

సోమశిల: మసీదుల్లోని మౌజన్లకు గౌరవవేతనాన్ని విడుదల చేయాలని ఆవాజ్ మండల కార్యదర్శి ఇఫ్తిఖర్‌అహ్మద్ కోరారు. ఈ మేరకు మౌజన్లు, ఇమామ్‌లతో కలిసి అనంతసాగరం తహసీల్దార్‌కు శనివారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మసీదుల్లో పనిచేసే మౌజన్లు, ఇమామ్‌లకు ప్రతినెలా గౌవరవేతనం ఇస్తామని ఎన్నికల్లో హామీ ఇచ్చిన కూటమి నాయకులు ఇప్పుడు ఇవ్వడం లేదన్నారు. మౌజన్లు, ఇమామ్‌లకు గౌరవవేతనాలు విడుదల చేసి ఆరు నెలలు అయిందన్నారు. ప్రభుత్వం వెంటనే గౌరవవేతనాలు విడుదల చేయాలి కోరారు. అన్వర్ బాషా, మౌజన్లు, ఇమామ్‌లు పాల్గొన్నారు



ఉపకరణాలను సద్వినియోగం చేసుకోవాలి


శిబిరాన్ని ప్రారంభించి వైద్యులు, సిబ్బందితో మాట్లాడుతున్న ఆర్డీఓ పావని

ఆత్మకూరు: ప్రభుత్వం అందజేస్తున్న ఉచిత ఉపకరణాలను విభిన్న ప్రతిభావంతులైన విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఆత్మకూరు ఆర్డీఓ బీ పావని కోరారు. ఆత్మకూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సర్వశిక్ష అభియాన్, అలింకో సంస్థల ఆధ్వర్యంలో విభిన్న ప్రతిభావంతులైన విద్యార్థులకు ఉచిత ఉపకరణాల నమోదుకు ప్రత్యేక శిబిరాన్ని శనివారం ఏర్పాటు చేశారు. ఈ శిబిరాన్ని ఆర్డీఓ ప్రారంభించి మాట్లాడారు. 6 ఏళ్ల నుంచి 18 ఏళ్లలోపు ప్రత్యేకావసరాల విద్యార్థులకు ఉపకరణాలను అందించేందుకు ప్రత్యేక శిబిరం నిర్వహించడం శుభపరిణామమన్నారు. కాగా ఆత్మకూరు నియోజకవర్గంలోని అన్ని మండలాల నుంచి సుమారు 137 మంది దివ్యాంగులు హాజరవగా, వారికి వైద్యపరీక్షలు నిర్వహించి అవసరమైన ఉపకరణాలను గుర్తించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ రఫీఖాన్, సమగ్ర శిక్ష సీఎంఓ పెంచలయ్య, ఐఈ కోఆర్డినేటర్ ప్రసాద్, అసిస్టెంట్ ఏఎంఓ శాంతకుమారి, ఎంఈఓలు అనంతలక్ష్మి, చలపతి, అలింకో సిబ్బంది జయకుమార్, కే పద్మ, ఎండీ అబ్దుల్ రెహమాన్, కె కుమార్, తదితరులు పాల్గొన్నారు.

ఆలయ భూముల వేలం అడ్డగింత

దుత్తలూరు: నర్రవాడలోని జనార్దనస్వామి ఆలయానికి సంబంధించిన భూముల కౌలు వేలాన్ని శనివారం నిర్వహించారు. దేవాలయ ప్రాంగణంలో నిర్వహించిన బహిరంగ వేలాన్ని స్థానికులు అడ్డుకున్నారు. ఆలయానికి సర్వే నంబర్ 297లో 60.04 సెంట్లు, 93 సర్వే నంబరులో 22.28 ఎకరాల భూములు ఉన్నాయి. 2014లో ఆలయ భూములకు కౌలు వేలం నిర్వహించగా గ్రామానికి చెందిన మల్లికార్జున ఐదేళ్ల కాలానికి దక్కించుకున్నారు. 2019లో మళ్లీ వేలం నిర్వహించేందుకు దేవదాయశాఖ అధికారులు సిద్ధమవగా, వాతావరణం అనుకూలించక పంట నష్టం వాటిల్లిందని, మరో ఏడాదిపాటు లీజు గడువు పొడిగించాలని మల్లికార్జున విజ్ఞప్తి చేశారు. అయితే అధికారులు అందుకు ఒప్పుకోకుండా వేలం నిర్వహించారు. ఏలూరుకు చెందిన నాగరాజు అనే వ్యక్తి భూములను ఐదేళ్ల కాలానికి దక్కించుకోగా గత నెలతో లీజు గడువు ముగిసింది. అయితే ఆలయ కమిటీతో పాటు దేవదాయ శాఖ అధికారులు కుమ్మక్కై తిరిగి నాగరాజుకే భూములు అప్పగించేందుకు నిర్ణయం తీసుకోవడంతో స్థానికులు వేలంపాటను అడ్డుకున్నారు. ఈ విషయమై ఆలయ ఈఓ ఉషశ్రీ మాట్లాడుతూ కౌలుకు తీసుకున్న వ్యక్తి న్యాయస్థానం ద్వారా అనుమతులు తెచ్చుకున్నాడని, అందుకు సంబంధించి వేలంపాట నిర్వహిస్తుండగా స్థానికులు అడ్డుకున్నారని తెలిపారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి వారి ఆదేశాల మేరకు నిర్ణయం తీసుకుంటామన్నారు.


వేలం పాటను అడ్డుకున్న స్థానికులు

ఆధార్ కేంద్రం ప్రారంభం రేపు

ఆత్మకూరు: పట్టణంలోని పాత ఆర్డీఓ కార్యాలయ ఆవరణలోని సచివాలయంలో మరో ఆధార్ కేంద్రాన్ని సోమవారం ప్రారంభించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ సీ గంగాప్రసాద్ శనివారం తెలిపారు. ఇప్పటికే మున్సిపల్ పరిధిలోని ఇరిగేషన్ సచివాలయంలో ఒక ఆధార్ కేంద్రాన్ని ప్రారంభించామని చెప్పారు. పట్టణ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

వేళాంగిణి మాత ఉత్సవాలు ప్రారంభం



సీతారామపురం : స్థానిక అరుంధతీయ కాలనీలో వేళాంగిణి మాత ఉత్సవాలు శనివారం ప్రారంభమయ్యాయి. తొలిరోజు డీజీపేట విచారణ గురువు రాజ్‌కుమార్ ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు, దివ్యబలి పూజ నిర్వహించారు. క్రైస్తవులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో హోమం

మర్రిపాడు: డీసీపల్లిలోని పంచముఖశక్తి గణపతి దేవస్థానంలో ఏర్పాటు చేసిన వినాయకుడి విగ్రహం వద్ద నాల్గో రోజు శనివారం హోమం నిర్వహించారు. ఖాన్‌సాహెబ్‌పేట కు చెందిన బోడే రమణారెడ్డి, వెన్నపూస చెన్నకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో అన్నదానం చేశారు.

6న కర్రతుమ్మ చెట్ల వేలం

వరికుంటపాడు:నక్కలగండి రిజర్వాయర్ పరిధిలో ఉన్న కర్రతుమ్మ చెట్ల బహిరంగ వేలం పాటను వచ్చే నెల 6వ తేదీన నిర్వహించనున్నట్లు ఇరిగేషన్ ఏఈ రమేష్ శనివారం తెలిపారు. తిమ్మారెడ్డిపల్లి సచివాలయంలో ఉదయం 11 గంటలకు జరిగే వేలంపాటలో ఆసక్తి కలిగిన వారు పాల్గొనాలని కోరారు.

తెలుగు భాషాభిమానుల నిరసన

కావలి (జలదంకి): తెలుగు భాషను ఖూనీ చేసేలా సినిమాలకు పేర్లు పెట్టకుండా సెన్సార్ బోర్డు చర్యలు తీసుకోవాలని తెలుగు భాషాభిమానులు డిమాండ్ చేశారు. తెలుగు భాషా దినోత్సవం నాడు విడుదలైన కొత్త లోక సినిమా పేరు తెలుగు భాషను ఖూనీ చేసేలా ఉందని ఆగ్రహం వ్యక్తం చేస్తూ కావలిలోని వెంకటేశ్వర థియేటర్ వద్ద శనివారం వారు నిరసన తెలిపారు. థియేటర్ మేనేజర్ రమణారావుకు పుష్పగుచ్ఛం అందజేసి సినిమా నిర్మాత, దర్శకుడికి తమ ఆవేదనను తెలియజేయాలని విజ్ఞప్తి చేశారు. తెలుగు భాషాభిమానులు జయప్రతాప్‌రెడ్డి, నున్నా మురళి, ప్రభాకర్, వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

మెరుగైన విద్యాబోధన అందించాలి

కావలి (జలదంకి): ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు మెరుగైన విద్యా బోధన అందించేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని కావలి ఎంఈఓ గోవిందయ్య అన్నారు. కావలి మండలంలోని ప్రభుత్వ ప్రాథమిక, ఉన్నత పాఠశాలల ఉపాధ్యాయులకు బోధన విధానాలపై అవగాహన కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. కావలిలోని వెంగళరావునగర్ మున్సిపల్ పాఠశాలలో జరిగిన ఈ కార్యక్రమంలో ఎంఈఓ గోవిందయ్య, క్లస్టర్ ప్రధానోపాధ్యాయుడు వెంకటేశ్వర్లు పాల్గొని ఉపాధ్యాయులకు శిక్షణ ఇచ్చారు. చదువులో వెనుకబడిన విద్యార్థులను గుర్తించి ప్రత్యేకంగా శిక్షణ అందించే విధానం, ప్రతి విద్యార్థి పాఠశాలకు వచ్చేలా ప్రోత్సహించడం, హ్యాండ్‌బుక్, మోడల్ పాఠాలు పదో తరగతి పబ్లిక్ పరీక్షల బ్లూప్రింట్, అసైన్‌మెంట్ బుక్‌లెట్‌ను పూర్తి చేయడం, తదితర అంశాలపై శిక్షణ అందజేశారు.



ఉదయగిరి జిల్లా ఏర్పాటుకు వినతి

దుత్తలూరు: దశాబ్దాలుగా వెనుకబడిన ఉదయగిరి కేంద్రంగా జిల్లాను ఏర్పాటు చేయాలని కోరుతూ ఉదయగిరి జిల్లా సాధన సమితి ఆధ్వర్యంలో తహసీల్దార్ యనమల నాగరాజుకు శనివారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వైఎస్సార్‌సీపీ, సీపీఎం నాయకులు మాట్లాడుతూ నెల్లూరు, ప్రకాశం, కడప జిల్లాల్లో 21 మెట్టప్రాంత మండలాలు దశాబ్దాలుగా అభివృద్ధికి నోచుకోక వెనుకబడి ఉన్నాయన్నారు. ఈ మండలాలను కలిపి ఉదయగిరి కేంద్రంగా జిల్లాను ఏర్పాటు చేస్తే అభివృద్ధి చెందుతాయని విన్నవించారు. ప్రభుత్వం కొత్త జిల్లాలకు సంబంధించి ఏర్పాటు చేసిన మంత్రివర్గ ఉపసంఘానికి వినతిపత్రాన్ని పంపాలని విజ్ఞప్తి చేశారు. వైఎస్సార్‌సీపీ, సీపీఎం నాయకులు కండ్లగుంట వెంకటరెడ్డి, దయాకర్‌రెడ్డి, ఒంటేరు వేణుగోపాల్‌రెడ్డి, కండ్లగుంట శివకుమార్‌రెడ్డి, పచ్చవ వెంకటేశ్వర్లు, గుజ్జుల మల్లికార్జున పాల్గొన్నారు.



ఉదయగిరి: ఉదయగిరి కేంద్రంగా ప్రత్యేక జిల్లాను ఏర్పాటుచేయాలని కోరుతూ స్థానిక చెక్కనగిషి కేంద్రంలో పనిచేస్తున్న మహిళలు డిప్యూటీ తహసీల్దార్ షాజియాకు శనివారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉదయగిరి కేంద్రంగా జిల్లాను ఏర్పాటు చేసిన అన్ని రంగాల్లో వెనుకబడిన మెట్టప్రాంతం అభివృద్ధి చెందుతుందన్నారు. చెక్కనగిషి కేంద్రం నిర్వాహకురాలు గౌసియాబేగం, జాకీర్‌హుస్సేన్, తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయ సాంకేతిక పరిజ్ఞానంపై అవగాహన

అల్లూరు: వ్యవసాయ రంగంలో వస్తున్న ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంపై రైతులు అవగాహన పెంచుకుని అందిపుచ్చుకోవాలని ఏఓ వెంకటేశ్వర్లు అన్నారు. మండలంలోని పురిణిలో ఆత్మ సంస్థ ఆధ్వర్యంలో వ్యవసాయ సాంకేతిక పరిజ్ఞానంపై రైతులకు అవగాహన కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతున్న మారుతున్న కాలాన్ని బట్టి ప్రతిఒక్కరూ సాంకేతిక పరిజ్ఞానంపై కొంత అవగాహన కలిగి ఉండాలన్నారు. అనంతరం డ్రోన్‌లతో ఎరువులు, పురుగు మందులు పిచికారీ, నానో ఎరువుల, జీవన ఎరువులు, ఆధునిక వ్యవసాయ పరికరాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంపీడీఓ వీరేంద్ర, తదితరులు పాల్గొన్నారు.


రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏఓ వెంకటేశ్వర్లు

దివ్యాంగుల పింఛన్ల తొలగింపు దుర్మార్గం



ఉదయగిరి: దివ్యాంగుల పింఛన్లను తొలగించడం దుర్మార్గమని, తొలగించిన పింఛన్లను వెంటనే పునరుద్ధరించాలని ఉదయగిరి నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్‌రెడ్డి శనివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఎన్నో ఏళ్లుగా పొందుతున్న పింఛన్లను తొలగిస్తున్నట్లుగా ఉదయగిరి నియోజకవర్గంలోని సుమారు 1000 మంది దివ్యాంగులకు నోటీసులు పంపారని తెలిపారు. గత ప్రభుత్వాల హయాంలోనే వైద్యులు వికలత్వ ధ్రువీకరణ పత్రాలు మంజూరు చేశారని గుర్తుచేశారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం పింఛన్లకు కోత పెట్టే ఆలోచనలో భాగంగా రీవెరిఫికేషన్ పేరుతో వికలత్వ శాతాన్ని తగ్గించి దివ్యాంగుల పొట్టకొట్టేందుకు కుట్ర పన్నిందని ఆరోపించారు. సెప్టెంబర్ 1న గతంలో మాదిరిగానే దివ్యాంగుల అందరికి పింఛన్లు అందించాలని కోరారు. దివ్యాంగుల పింఛన్లు తొలగిస్తే బాధితుల తరఫున పోరాటం చేస్తామని హెచ్చరించారు.

ట్రస్ట్ భూమిపై తమ్ముళ్ల కన్ను



- జామాయిల్ చెట్ల తొలగింపును అడ్డుకున్న గ్రామస్తులు

కలిగిరి: కలిగిరి పంచాయతీ జిర్రావారిపాళెంలోని మాగుంట రాఘవరెడ్డి చారిటబుల్ ట్రస్ట్ భూములపై వింజమూరు మండలానికి చెందిన టీడీపీ నేతలు కన్నేశారు. ఈ భూమిలో జామాయిల్ చెట్లను తొలగించేందుకు జేసీబీని శనివారం తీసుకొచ్చారు. విషయం తెలుసుకున్న గ్రామస్తులు నిలదీయడంతో దీన్ని వెనక్కి తీసుకెళ్లారు. వివరాలు.. కలిగిరి రెవెన్యూలోని సర్వే 1012-1 ఖాతా నంబర్ 732లో 3.22 ఎకరాల పొలం ఉంది. కలిగిరిలో మాగుంట సుబ్బరామిరెడ్డి జూనియర్ కళాశాల ఏర్పాటుకు మాగుంట రాఘవరెడ్డి చారిటబుల్ ట్రస్ట్‌కు మార్కెట్ విలువ మేరకు భూమి కేటాయించాలని తహసీల్దార్‌కు 1995లో కలెక్టర్ సిఫార్సు చేశారు. ఈ మేరకు సర్వే నంబర్ 1012లోని 4.02 ఎకరాలను మార్కెట్ రేట్‌కు కేటాయించారు. అనంతరం 4.02 ఎకరాల్లో 80 సెంట్లను శ్మశానానికి కేటాయించారు. మిగిలిన 3.22 ఎకరాలను మాగుంట రాఘవరెడ్డి చారిటబుల్ ట్రస్ట్ పేరుతో అనుభవ స్వభావం ఆరెస్టీగా మార్చారు.

సేవా కార్యక్రమాలకే ఉపయోగించాలి

మాగుంట రాఘవరెడ్డి చారిటబుల్ ట్రస్ట్‌కు ప్రభుత్వం కేటాయించిన భూమిని సేవా కార్యక్రమాలకే వినియోగించాలి. వాణిజ్యావసరాలకు వినియోగించే అధికారం ట్రస్ట్‌కు లేదు.

– గిరీష్‌కుమార్, ఇన్‌చార్జి తహసీల్దార్, కలిగిరి

పెరిగిన భూముల ధరలు

ట్రస్ట్ భూమి జాతీయ రహదారిని ఆనుకొని ఉంది. ఇక్కడ భూమి ధరలు అమాంతం పెరిగాయి. ఈ నేపథ్యంలో వింజమూరు మండలానికి చెందిన ఇద్దరు టీడీపీ నేతలు భూమిపై కన్నేశారు. మరోవైపు ట్రస్ట్ చైర్మన్, ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి ద్వారా సదరు భూమిని కొనుగోలు చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారనే ప్రచారమూ ఉంది. కాగా ట్రస్ట్ భూములు అన్యాక్రాంతం కావడంపై జిర్రావారిపాళెం గ్రామస్తులతో పాటు స్థానిక టీడీపీ నేతలూ ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తమ ఊరి భూముల విషయంలో వింజమూరు టీడీపీ నేతలు జోక్యం చేసుకుంటే అంగీకరించేది లేదని స్పష్టం చేశారు.